క్లుప్తంగా

నాయకుల చిత్రపటాలకు క్షీరాభిషేకం



ధర్మపురిలో క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ధర్మపురి: ఎస్సీల వర్గీకరణకు సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంపై హర్షిస్తూ నాయకుల చిత్ర పటాలకు కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నాయకులు టపాసులు పేల్చి, స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకకున్నారు. ఈసందర్భంగా ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు చిలుమల లక్ష్మణ్ మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ, సీఎం రేవంత్‌రెడ్డి కృషితో సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్, సీఎం, మందకృష్ణ, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసారు.కార్యక్రమంలో నాయకులు పారపెల్లి రాజమల్లయ్య, బొల్లారపు పోశయ్య, అరికెల్ల సతీష్, జిలపెలి రవి, కట్ట లక్ష్మణ్ తదితరులున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కు అందిస్తున్న వాకిటి సత్యంరెడ్డి

మల్లాపూర్: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయమని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ వాకిటి సత్యంరెడ్డి అన్నారు. మండలంలోని ముత్యంపేటకు చెందిన రాధాబాబుకు సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.40వేల చెక్కును అందించారు. మాల, మాదిగల సంఘ భవనాలకు రూ.5లక్షల చొప్పున ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, త్వరలోనే ప్రొసీడింగ్ పత్రాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తేలు నరేష్, వంగ అశోక్‌యాదవ్, వాకిటి బుచ్చిరెడ్డి, దామ రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



డీజే నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎస్సై

మల్యాల: నిబంధనలకు విరుద్ధంగా డీజే పాటలతో ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే కేసులు నమోదు చేస్తామని మల్యాల ఎస్సై నరేశ్‌కుమార్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం మండలంలోని డీజే నిర్వాహకులకు ఎస్సై నరేశ్‌కుమార్ కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే రీతిలో ఇష్టారాజ్యంగా డీజే నిర్వహిస్తే చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

దోమల నివారణకు ఫాగింగ్ తప్పనిసరి



చిన్నమెట్‌పల్లిలో ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

కోరుట్లరూరల్: గ్రామాల్లో దోమల నివారణకు తప్పనిసరిగా సాయంత్రం వేళ ఫాగింగ్ చేయాలని ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. వర్షాకాలంలో దోమల బెడద ఎక్కువగా ఉంటుందని పొగ స్ప్రే చేయటం ద్వారా దోమలు తగ్గే అవకాశం ఉంటుందన్నారు. గ్రామాల్లో ప్రతీ రెండు మూడు రోజులకు ఒకసారి ఫాగింగ్ తప్పనిసరిగా చేయాలన్నారు. ప్రజలు పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇళ్ల ముందు మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు.

వ్యవసాయంపై అవగాహన



సారంగాపూర్: వ్యవసాయంపై విద్యార్థులకు అవగాహన ఉండాలనే ఉద్దేశంతో స్టడీ టూర్‌లో భాగంగా బీర్‌పూర్ మండలం కొల్వాయిలోని ఓ ప్రైవేటు పాఠశాల గ్రామ శివారులోని పంట పొలాల్లోకి తీసుకెళ్లారు. నారు తీసే విధానం, నాటేసే పద్ధతిపై అవగాహన కల్పించారు.

గుంతల రోడ్లు.. ప్రయాణికుల పాట్లు

- తరచూ ప్రమాదాలు
- వాహనదారుల ఇబ్బందులు
- పట్టించుకోని ఆర్అండ్‌బీ అధికారులు



అమ్మక్కపేట శివారులో మూలమలుపు వద్ద గుంత

ఇబ్రహీంపట్నం: మండలంలోని గ్రామాల్లోని రహదారులపై గుంతలు పడి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇబ్రహీంపట్నం నుంచి అమ్మక్కపేట– మెట్‌పల్లికి వెళ్లే డబుల్ రోడ్డు, మెట్‌పల్లి నుంచి మూలరాంపూర్ ఆర్‌అండ్‌బీ రోడ్లలో గుంతలు పడి వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇబ్రహీంపట్నం మండలకేంద్రం నుంచి ప్రతి రోజూ మెట్‌పల్లి వైపు వందలాది వాహనాలు వెళ్తుంటాయి. 7 ఏళ్ల క్రితం అమ్మక్కపేట శివారులోని టాటా డ్రైవ్ శిక్షణ కేంద్రం వద్ద మూలమలుపు వద్ద డబ్బా వాటర్ గ్రిడ్ మెయిన్ పైప్‌లైన్ వేసేందుకు ఆర్అండ్‌బీ రోడ్డు తవ్వి పైప్‌లైన్లు వేశారు. అప్పటి నుంచి నేటి వరకు ఆ గుంతను పూడ్చి బీటీతో ప్యాచ్ వర్క్ చేయకపోవడంతో వాహనదారులు వేగంగా వచ్చి ఆకస్మాత్తుగా గుంతలు కనబడి సడెన్‌బ్రేక్ వేసి వాహనాలు అదుపుతప్పి పడి గాయాల బారినపడుతున్నారు. ఐదేళ్ల క్రితం ఇదే గుంతల వద్ద ఇబ్రహీంపట్నంకు చెందిన ఓ యువకుడు ద్వి చక్ర వాహనంపై వస్తూ అదుపు తప్పి కింద పడి తీవ్ర గాయాలై మృతి చెందాడు. రాత్రి సమయంలో ఈ గుంతల రోడ్ల వద్ద చిన్న చిన్న ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇబ్రహీంపట్నం నుంచి అమ్మక్కపేట వెళ్లే రోడ్డులో టాటా డ్రైవ్ మూలమలుపు వద్ద గుంతను బీటీతో ప్యాచ్ చేయడానికి ఆర్అండ్‌బీ అధికారులు, భగీరథ అధికారులు మేము తప్పలేదని, ఇద్దరు గుంతను పూడ్చకపోవడంతో ఇటీవల వర్షాలకు గుంత పెద్దగా కావడంతో వాహనదారులు అనేక ఇబ్బంది పడుతున్నారు. అలాగే ఇబ్రహీంపట్నం శివారులో మిచ్చమ్మ ఆశ్రమం వద్ద మూడేళ్ల క్రితం పైపులు వేసేందుకు కాంట్రాక్టర్ రోడ్డును తవ్వి పైప్‌లు వేసి, గుంతను పూడ్చకపోవడంతో పెద్ద గుంత ఏర్పడి, వాహనదారులు వేగంగా వచ్చి అదుపు తప్పి కింద పడుతున్నారు. అలాగే మెట్‌పల్లి నుంచి మూలరాంపూర్ రోడ్లపై ఉన్న పెద్ద పెద్ద గుంతలను ఆర్అండ్‌బీ అధికారులు, భగీరథ అధికారులు బీటీతో పూడ్చివేసి ప్రమాదాలు జరగకుండా నివారించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



మెట్‌పల్లి రోడ్డులో పడ్డ గుంతలు

8 కిలోమీటర్ల రోడ్డులో 9 గుంతలు

జాతీయ రహదారి నుంచి ఇబ్రహీంపట్నం వరకు రోడ్డు 8 కిలోమీటర్లు ఉండగా, ఈ రోడ్డులో 9 గుంతలు ఉన్నాయి. ఇటీవల వర్షాలకు ఈ గుంతలు లోతుగా అవ్వడంతో వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు వెంటనే స్పందించి, గుంతలలో బీటీతో ప్యాచ్‌లు చేసి, వాహనదారుల ఇబ్బందులు తొలగించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



నిత్యం మెట్‌పల్లి వైపు, మెట్‌పల్లి నుంచి మూలరాంపూర్, రోడ్లపై వెళ్లే వాహనదారులు గుంతల రోడ్లతో ఇబ్బందులు పడుతున్నాం. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి రోడ్డులో అనేక చోట్ల పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి.అధికారులు స్పందించి గుంతలు డాంబర్‌తో పూడ్చి వేయాలి.

– కొడిమ్యాల దీపక్‌రాజ్, ఇబ్రహీంపట్నం

గుంతలు పూడ్చి వేయాలి



ఇబ్రహీంపట్నం నుంచి మెట్‌పల్లికి నిత్యం పలు ప్రయివేటు వాహనాలలో మెట్‌పల్లికి ప్రయాణికులను తీసుకవెళ్తాం. ఈ రోడ్డులో పెద్ద పెద్ద గుంతలు పడటం వలన వాహనదారులం అనేక ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి, పెద్ద పెద్ద గుంతలను పూడ్చివేయాలి.

– గంగాధర్, ఇబ్రహీంపట్నం

వానాకాలం వాహనాలతో భద్రం

గొల్లపల్లి: వర్షాకాలం ప్రతీ ఒక్కరు తమ ద్విచక్ర వాహనాలను భద్రంగా చూసుకోవాలి. వాహనాలు మరమ్మతులకు గురైతే కనీసం రూ.2 వేలు చేతిలో ఉండాల్సిందే. ఇంజన్ పాడైతే రూ 8 వేల వరకు ఖర్చు అవుతోంది. ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా అదనపు భారం పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. కనీస జాగ్రత్తలు పాటిస్తే వాహనాలు మన్నికగా ఉంటాయని సీనియర్ మెకానిక్‌లు చెబుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా 1.80 లక్షలకు పైగా ద్విచక్ర వాహనాలు ఉన్నాయి. వర్షాకాలం ద్విచక్రవాహనాలు తరచూ రిపేరుకు వస్తాయి. వర్షంలో వాహనాలను ఎక్కడ పడితే అక్కడ ఆపేస్తే వాహన ఇంజన్‌లోకి నీరు చేరి మొరాయిస్తుంటాయి.

- చిన్నపాటి జాగ్రత్తలు తీసుకుంటే వాహనాలు పాడవకుండా ఉంటాయి.
- వాహనాలను తడవనివ్వకూడదు. టైర్లు,బ్రేక్‌లు బాగున్నాయా..?లేవా..?అని చూసుకోవాలి.
- చైన్‌ను లూబ్రికేషన్ చేయించాలి. బ్యాటరీ ఫుల్‌గా ఉండాలి. బల్బుపోతే వెంటనే మార్చుకోవాలి.
- వర్షానికి వాహనం వానలో తడుస్తూ చాలా మంది ద్విచక్రవాహనదారులు పెద్దగ పట్టించుకోరు.బయట తిరిగి ఇంటికి వచ్చాక తిరిగి వర్షంలోనే వాహనం పెడుతారు.ఇలా ఎప్పుడు చేయకూడదు.తప్పని సరిగా వాహనం పై కవర్ కప్పాలి.వర్షం పడని ప్రాంతంలో పార్కింగ్ చేస్తే భద్రంగా ఉంటుంది.
- బైక్‌లపై జాగ్రత్తగా ప్రయాణం చేయాలని జగిత్యాలకు చెందిన బైక్ మెకానిక్ చిరంజీవి సూచించారు. సరైన జాగ్రత్తలు పాటిస్తే వాహనాలను భద్రంగా చూసుకోవచ్చని తెలిపారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం





కోరుట్ల, రాయికల్‌లో స్నేహితుల దినోత్సవ సంబరాలు

మెట్‌పల్లి: పట్టణంలో స్నేహితుల దినోత్సవ వేడుకలను యువత ఆదివారం ఘనంగా జరుపుకుంది. ఈ సందర్భంగా పలు చోట్ల యువకులు కేక్‌లు కట్ చేసి స్వీట్లు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1992–93 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు వేడుకలు జరుపుకుని పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో మహమ్మద్ అజీమ్, గుర్రాల సుధాకర్, గుంటుక మహేశ్వర్, ధ్యావనపల్లి ప్రసాద్ తదితరులున్నారు.

రాయికల్: పట్టణంతో పాటు మండలంలోని 32 గ్రామాల్లో యువతీయువకులు ఆదివారం ఫ్రెండ్‌షిప్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం మహిళలు, చిన్నారులు కేక్ కట్‌చేసి ఫ్రెండ్‌షిప్‌డే సంబరాల్లో పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న స్నేహితులు

మల్లాపూర్: మండలంలోని పాతదాంరాజుపల్లి గ్రామానికి చెందిన మారంపెల్లి శ్రీనివాస్ 2013లో మృతి చెందగా, వృద్ధాప్యంలో ఉన్న మిత్రుడి తల్లిదండ్రులకు అండగా నిలిచేందుకు చిన్ననాటి మిత్రులు పూనుకున్నారు. కొత్తదాంరాజుపల్లి జెడ్పీ హైస్కూల్‌లో 2006–07 బ్యాచ్ 10వ తరగతి పూర్వ విద్యార్థులు మేమున్నాం.. అంటూ బాధిత మిత్రుడి కుటుంబానికి స్నేహితుల దినోత్సవ వేళ బాసటగా నిలిచారు. ఆదివారం రూ.30వేల ఆర్థిక సాయం అందించారు. భవిష్యత్తులో మిత్రుడి తల్లిదండ్రులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాటిపెల్లి రాజేందర్, బద్దం హరీష్, పనాస స్వామి, పెండెం జగదీష్, బండి రాజు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలరూరల్: రాష్ట్రంలో ఇళ్లు లేని నిరుపేదలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తుందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలానికి చెందిన 247మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు, 57 మందికి కల్యాణలక్ష్మి చెక్కులను జగిత్యాల పొన్నాల గార్డెన్‌లో ఆదివారం ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో సంక్షేమ అభివృద్ధి పథకాలు అమలు చేస్తామన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 31 వేల కోట్లతో ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేసిందని తెలిపారు. దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే సాగునీటి కాలువలు తవ్వారని తెలిపారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్లు పత్తిరెడ్డి మహిపాల్‌రెడ్డి, సందీప్‌రావు, మాజీ మార్కెట్ చైర్మన్ దామోదర్‌రావు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల మంజూరుకు కృషి

జగిత్యాలటౌన్: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తానని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ హామీ ఇచ్చారు. ఇళ్ల స్థలాల కోసం జగిత్యాల ఆర్డీవో కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న జర్నలిస్టుల నిరసన దీక్షకు ఎమ్మెల్యే సంఘీభావం తెలిపి మాట్లాడారు. ప్రభుత్వంతో మాట్లాడి ప్రాధాన్యత క్రమంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు తన వంతుగా కృషి చేస్తానన్నారు. జర్నలిస్టుల నిరసన దీక్షకు బీజేపీ రాష్ట్ర నాయకుడు ముదుగంటి రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు గిరి నాగభూషణం, దివ్యాంగుల సంఘం నాయకుడు శ్రీనివాస్, అజ్గర్‌తో పాటు పలువురు సంఘీభావం తెలిపారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాత్రికేయులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు కోసం ఎమ్మెల్యేకు వినతి

రాయికల్: మండలంలోని కిష్టంపేట గ్రామంలో స్వయం సహాయక సంఘ భవనం,చల్ గల్, కిష్టంపేట్ గ్రామానికి రహదారి నిర్మాణంకు నిధులు మంజూరు చేయాలని కోరుతు ఆదివారం గ్రామ నాయకులు ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ కలిసి వినతి పత్రం సమర్పించారు.

ఎమ్మెల్యే పరామర్శ

మండలంలోని చింతలూరు గ్రామ మాజీ సర్పంచ్ అనుపురం శ్రీనివాస్ తల్లి పుల్లమ్మ ఇటీవల మరణించగా, వారి కుటుంబ సభ్యులను ఆదివారం ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పరామర్శించారు.

సుప్రీంకోర్టు తీర్పుపై మోచీ కులస్తుల సంబరాలు



మెట్‌పల్లి: ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై హర్షం వ్యక్తం చేస్తూ పట్టణంలో ఆదివారం మోచీ సంఘం ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మోడీ, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగల చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో దశరథం, పెంటయ్య, సాయిలు, రాములు, కొండ్లెపు శ్రీనివాస్, కావలి గంగాధర్, మధుసాగర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ

జగిత్యాలరూరల్: మండలంలోని పోరండ్ల గ్రామానికి చెందిన రైతు పడిగెల శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల అప్పుల బాధతలో ఆత్మహత్యకు పాల్పడగా, ఆదివారం బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పరామర్శించారు. బాలపెల్లి గ్రామానికి చెందిన ఓర్రె భూమయ్య అనారోగ్యంతో మృతిచెందగా, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

10 న మాదిగ ఉపకులాల కృతజ్ఞత సభ

మేడిపల్లి: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుతో ముప్పై ఏళ్ల కల నెరవేరిందని మాదిగ, ఉపకులాలు సంబరాలు చేసుకున్నారు. మేడిపల్లిలో ఆదివారం మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం పీఎస్ఆర్ గార్డెన్‌లో మాదిగ, ఉపకులాల నాయకులు మాట్లాడారు. ఆగస్టు పదో తేదీన కృతజ్ఞత సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మకిలి ఇజ్రాయిల్, టాయ్స్ అధ్యక్షుడు బంగారు దీపక్, చిలివేరి వెంకటేశ్, ప్రేమసాగర్, నూతిపల్లి శంకర్, కాచారం మాజీ సర్పంచ్ చిట్యాల సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

లోకల్ వాయిస్

హైలెవల్ కల్వర్టు నిర్మించాలి



పెగడపల్లి: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో ఆర్అండ్‌బీ ప్రధాన రహదారిపై ఉన్న లోలెవల్ కల్వర్టును ఆధునీకరించాలి. చిన్నపాటి వర్షానికే కల్వర్టుపై రాకపోకలు సాగించాలంటే ఇబ్బందిగా ఉంది. హైలెవల్ కల్వర్టు నిర్మించేందుకు గత ప్రభుత్వం రూ. 2.50 కోట్లు మంజూరు చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు చేయడంలో జాప్యం చేస్తున్నాడు. అధికారులు చొరవ చూపి కల్వర్టు నిర్మాణ పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలి.

– బొమ్మెన స్వామి, పెగడపల్లి

పోలీసుల చొరవతో రోడ్డుకు మరమ్మతు



రోడ్డుపై గుంతలు పూడ్చుతున్న పోలీసులు

బుగ్గారం: మండల కేంద్రం లోని ప్రధాన రహదారి గుంతలమయమై అధ్వానంగా మారడంతో గత కొంతకాలంగా రాకపోకలకు తీవ్ర అసౌకర్యంగా మారింది. ఈ నేపథ్యంలో మండల ఎస్సై శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం రోడ్డుకు మరమ్మతులు చేయించారు. ఇందుకోసం అవసరమైన కంకర,డస్ట్, మొరం ఎస్సై సమకూర్చారు. దీంతో జాతీయ రహదారి నుంచి బుగ్గారం మండల కేంద్రం వరకు రహదారిపై గల పలు గుంతలను పూడ్చివేశారు. కార్యక్రమంలో పోలీసులు సైతం స్వయంగా పాల్గొని శ్రమదానం చేయగా, స్థానికులు సహకరించారు.రోడ్డు మరమ్మతు పనులను సీఐ రాంనర్సింహారెడ్డి పర్యవేక్షించి పోలీసులను అభినందించారు. కార్యక్రమంలో రెవెన్యూ పరిశీలకులు బాపురెడ్డి,పోలీసులు సిబ్బంది, నాయకులు చుక్క గంగారెడ్డి,ఎన్నం కిషన్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

టీవీఎస్వీ స్వచ్ఛంద సేవా సంస్థ రాష్ట్ర యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మల్లేశ్ యాదవ్

మల్లాపూర్: సామాజిక సేవలతో పాటు యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్న గనవేని మల్లేశ్ తెలుగు వెలుగు సాహితి వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ రాష్ట్ర యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియామకమయ్యారు. ఈ మేరకు ఆ సంస్థ వ్యవస్థాపకుడు, జాతీయ చైర్మన్ బ్రహ్మశ్రీ పోలోజు రాజ్‌కుమార్ ఆదివారం నియామక ఉత్తర్వులు అందజేశారు.తన నియామకానికి సహకరించిన జాతీయ చైర్మన్ పోలోజు రాజ్‌కుమార్‌కి, జాతీయ అధ్యక్షుడు డాక్టర్ రంగిశెట్టి రమేశ్, ప్రధాన కార్యదర్శి వలబోజు మోహన్‌రావులకు గనవేని మల్లేశ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ కార్యవర్గం..

కథలాపూర్: మండల ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బొమ్మెన గ్రామానికి చెందిన గుండేటి సురేశ్ ఎన్నికయ్యారు. ఆదివారం కథలాపూర్‌లో ఫొటోగ్రాఫర్లు సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఉపాధ్యక్షుడిగా చిలువేరి శ్రీకాంత్, కార్యదర్శిగా మచ్చ శేఖర్, జిల్లా కౌన్సిలర్‌గా అందె గోవర్ధన్, సలహాదారుగా కట్టెకోల సతీష్, జక్కని గంగప్రసాద్ ఎన్నికయ్యారు.

సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం మండల అధ్యక్షుడిగా సుభాష్ గౌడ్

ఇబ్రహీంపట్నం: సర్దార్ సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం మండల అధ్యక్షుడిగా మండలంలోని డబ్బా గ్రామానికి చెందిన నెరేళ్ల సుభాష్‌గౌడ్‌ను నియమించినట్లు కోరుట్ల నియోజకవర్గ అధ్యక్షుడు ఏపూరి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఆదివారం మెట్‌పల్లిలో సమావేశం నిర్వహించి, గీత కార్మికుల కోసం నిరంతరం పాటు పడుతుండటంతో రెండోసారి మండల అధ్యక్షుడిగా ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెర్లపల్లి రాజేశ్వర్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్, జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ కట్ట నర్సగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి నాయిని శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గాలు..

రాయికల్: పట్టణ ఆర్యవైశ్య సంఘ మహిళా అధ్యక్షురాలుగా జిల్లా లావణ్య , ప్రధాన కార్యదర్శిగా సిద్ధం శెట్టి స్వప్న, కోశాధికారిగా అయిత మాధవి ఆదివారం ఎన్నికైనట్లు పట్టణ అధ్యక్షుడు కూరగాయల రవి,ప్రధాన కార్యదర్శి గరిపెల్లి శ్రీనివాస్,కోశాధికారి పవన్ తెలిపారు.

సంఘమిత్ర అధ్యక్షుడిగా శివారెడ్డి

రాయికల్ పట్టణంలోని సంఘమిత్ర(శివాజీ) యూత్ అధ్యక్షుడిగా పటేల్.శివారెడ్డి,ఉపాధ్యక్షునిగా జిల్లాల.సూర్యంరెడ్డి,కోశాధికారిగా పాలడుగు.విజయకేతన్ రెడ్డి,కార్యవర్గ సభ్యులుగా కన్నెవేని వేణుగోపాల్ రెడ్డి,పాతురి శివరామకృష్ణరెడ్డి, బోడుగం తిరుపతిరెడ్డి,ఎద్దండి శివారెడ్డి,జిల్లాల సతీష్‌రెడ్డి లను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కాపు రైతు సేవా సంఘం..

మండలంలోని అల్లీపూర్ కాపు రైతు సేవ సంఘం అధ్యక్షుడిగా అత్తినేని శంకర్. ఉపాధ్యక్షుడిగా అత్తిని మల్లేశం, ప్రధాన కార్యదర్శిగా అత్తినేని భూమయ్య కోశాధికారిగా రాయిల్ల రాజేందర్,సహాయ కార్యదర్శి గా అత్తినేని రాజన్న,మంగళారపు చిన్నారెడ్డి ఎన్నికయ్యారు.

మొక్కలు నాటిన సత్యసాయి భక్తులు

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలో సత్యసాయి సేవాసమితి భక్తులు ఆదివారం పలు ఆలయాల వద్ద మొక్కలు నాటారు. సత్యసాయి దేవాలయం , అమృతాలయం, హనుమాన్ మందిరం వద్ద వివిధ రకాల పండ్లు, పూలమొక్కలను నాటారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి కన్వీనర్ గూడ రమేష్, సేవాదళ్ కన్వీనర్ దొంతుల హరీశ్, సేవాసమితి సభ్యులు సత్యనారాయణ, గణేశ్, జక్క చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

7న కాకతీయ కాలువకు నీటి విడుదల

ఇబ్రహీంపట్నం: శ్రీ రాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు ఈ నెల 7న నీటిని విడుదల చేస్తున్నట్లు ఎస్సారెస్పీ ఎస్ఈ శ్రీనివాస్‌రావు గుప్తా, ఈఈ వెంకటేశ్వర్లు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతులకు పొలాలు వేసుకునేందుకు నీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కోరుట్ల: గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని జగిత్యాల జిల్లా గౌడ సంఘ అధ్యక్షుడు గొల్లపల్లి చంద్రశేఖర్ గౌడ్ అన్నారు. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్, మాజీ మంత్రి రాజేశం గౌడ్ లను కలిసి వినతి పత్రాలు సమర్పించారు. గౌడ కులస్తుల సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రంలో కోరారు. కార్యక్రమంలో కోరుట్ల, మల్లాపూర్ గౌడ సంఘాల అధ్యక్షులు బొలపెల్లి శ్రీనివాస్ గౌడ్, రాజేందర్‌గౌడ్, సత్యనారాయణ గౌడ్, పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇల్లు

కథలాపూర్: మండలంలోని అంబారిపేటలో శనివారం రాత్రి కురిసిన వర్షానికి గ్రామానికి చెందిన తోకల నర్సవ్వ అనే వృద్ధురాలి ఇల్లు కూలినట్లు గ్రామస్తులు ఆదివారం తెలిపారు. నర్సవ్వ కూతురు, మనుమడితో కలిసి పెంకుటిల్లులో నివసిస్తున్నారు. శనివారం రాత్రి వర్షం కురియడంతో ఇల్లు కూలింది. బాధితురాలికి ప్రభుత్వం ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అపూర్వ సమ్మేళనం..



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం బండలింగాపూర్ ప్రభుత్వ పాఠశాల 2002–03వ పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. వెల్లుల గ్రామ శివారులోని ఓ ఫంక్షన్ హాల్‌లో వారంతా కలిసి ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు అలనాటి మధుర స్మృతులు నెమరవేసుకొని యోగ క్షేమాలు తెలుసుకున్నారు. తమకు పాఠాలు బోధించిన గురువులను సన్మానించారు.



మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం మెట్లచిట్టాపూర్ ప్రభుత్వ పాఠశాలలోని ఓ భవనం శిథిలావస్థకు చేరుకుంది. విద్యార్థులు భయం భయంగా చదువుకుంటున్నారు.

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9705346639